# నల్లమబ్బుల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు

## కుక్కల దొర

"తాటిచెట్టెక్కి ఒకగెల ముంజకాయిలు కొట్టరాదా బావా!" అన్నానేను.

"తాటిచెట్టంటే నాకా కుక్కలే గుర్తొస్తయ్యి" అన్నడు ఇస్రాయేలు బావ.

"తాటి చెట్టుకీ కుక్కలకీ ఏంది సమందం?" అనడిగిన

"ఒకసారి నేను పేంటు, సాక్కా యేసుకున్నా! కాకి పేంటు, కాకి సాక్కా!" అంటా మొదలేసిండు.

"ఆగాగు, తాటిచెట్టు, కుక్కలు అన్నవు. మళ్లా పేంటు, సాక్కా అంటుండవు, అసలు సంగతి జెప్పు" అంటా అడ్డం తగిలిన.

"నువ్వట్ట అడ్డం బడితే, నేజెప్పను" అని మూతి ముడిసిండు.

"సరే! అడ్డం రాన్లే. జెప్పు" అన్నా.

"కాకి పేంటు, కాకి సాక్కా యేసుకోని కొడేలు దీసుకున్న. గొడ్డేలు దీసుకొని పొయ్యే వోణ్ణి ఆ యేల కొండేలు దీసుకున్న".

"అంటే ఇంగిలీసు సినమాలో కాకిరంగు గుడ్డలేసుకోని యాటకి బోయినట్టా?" అని మళ్ళీ అడ్డం తగిలిన.

ఈసారి మా బావకి కోపం రాలా

"ఆ అట్టనే బోయినా" అన్నడు ఉషారుగా.

"ఇకపోతా వున్నప్పుడు యేం జరిగిందంటే గొల్లోళ్ల ఇళ్లల్లో కాకర్లోల్లు వుండారు. వాళ్ల యిళ్ల దగ్గరికి పోయినంక అక్కడ రెండు కుక్కలున్నయ్యి. ఈ కుక్కలు గట్టిగా 'బౌ' మన్నై. అనే తలికి అయ్యి నన్నేం జేస్తయిలే అనుకోని గమ్మునున్న. కానీ అయ్యి నా దగ్గరికి రాబోతున్నై. ఆ సమయంలో నేనొక రాయి దీసుకుని వాటి మీదేసినా. వాటిలో ఒక కుక్క ఆ రాయిని పటిక్కిన గొరికి నా మీదికి వచ్చేసినయ్యి. నేను వాటి రొద్దునికి తట్టుకోలేక తాటిచెట్టు యెక్కిన. తాటి మానుమీద సగంతరానికి ఎక్కి కూచుని

"యేం రావన్నా! ఈ కుక్క లెవురివి? నేను గానీ దిగిన్నంటే మీరు, మీ కుక్కలు యేమవుతరో, వరుసబెట్టి ఏటి సావగొట్టేస్తా!" అని అన్నా.

ఓబ్బాయ్యో! యేమనవులే! నేను అదిలిస్తలే" అని ఆ రామయ్య సలహా యిచ్చిండు.

"ఈ తడవ నేను కొండకు బోయొస్తే నీ



—ఎండ్లూరి సుధాకర్

కుక్కలు బతకవు కట్టేసుకో" అన్జెప్పి రామయ్య కుక్కల్ని తరిమేసివంక నేను చెట్టుదిగి కొండకు బోయిన. అక్కడ ప్రెతీకంగా కట్టెలేరుకోని, ఈ కుక్కల గొట్టాలని రెండు బడితెలు గొట్టుకున్న. ఆ తాటిసెట్ల దగ్గిరికి వొచ్చిం తర్వాత మార్కు బర్రెలు గాస్తావున్నడు.

"యేవిరా? మార్కా! ఈ కుక్కలు నన్ను కరవనొచ్చి నయ్యి. ఈ రోజు మాత్రం అయ్యి వుంటానికి లేదు. వాటిని సావగొడదం పా!" అని జెప్పేసి మార్కుకొక బడితిచ్చి నేనొక బడితె దీసుకోని ఆవనే వూరిమీదకి బోయినం.

వూళ్లో వున్నోళ్లు యేమనుకుంటున్నరంటే "యేందీళ్లు బడితె దీసుకోని కుక్కల తరుముతుండరు యేందయ్యో" అనుకుంటండరు.

"నోరెత్తితే మిమ్మలగూడ సావగొట్టేస్త. ఎక్కువగానీ మాట్లాడితే కుక్కలగాదు మనుషుల్నే సావగొట్టేస్త" అని రొప్పకుంటా అరిచినా.

ఆ కుక్కలు మాకు దొరక్కుండా ఆ కనిగిరి గడ్డకు యెల్లి పోయినయి. ఇయ్యి మనకి దొరకవులే అనుకొని మా కట్టెల మోవును నెత్తిన పెట్టుకొని ఇంటికొచ్చేసిన.

"అది బావ కుక్కల కథ" అన్నాడు

"అయితే ఇస్రయేలు బావా నువ్వు బోవేట గాడి వన్నమాట. సావగొట్టేస్త, సావగొట్టేస్త అని డంబాలు పలికి కుక్కను గొట్టలేక పోయినావు గదా! ఈ మాత్రం దానికేనా పాముల దేవయ్య పందులవేట కతజెప్పి ఫక్కున నవ్వినావు. కాకి గుడ్డల పరువు దీస్తివి గదా!" అని నేనంటే

పక్కనున్నోల్లందరూ ముసిముసి నవ్వులు నవ్విండ్రు.